కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 37, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 31, దోసకాయ 18, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 65, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 10–12, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎమ్మెల్యేకు పలువురి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే తలసానికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నాయకులు

అమీర్‌పేట: మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సంక్రాంతి పండుగ వేళ బీఆర్‌ఎస్ నాయకులతో చాలా సమయం గడిపారు. బుధవారం ఉదయం అమీర్‌పేట డివిజన్ ఎస్‌ఆర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నేతలతో కలిసి హోటల్‌లో టిఫిన్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు పోలీసు అధికారుల సంఘం నాయకులు ఎమ్మెల్యేకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంట్లో కాలు జారి కింద పడి పోయి గాయాలపాలైన సీనియర్ సిటిజన్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు పార్థసారథి నివాసానికి వెళ్లి పరామర్శించారు. స్థానిక నాయకులు హనుమంత్‌రావు, సంతోష్, కూతురు నర్సింహ పాల్గొన్నారు.

ఆర్యనగర్‌లో మాయావతి జన్మదిన వేడుకలు



లాలాపేట: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదిన వేడుకలను బుధవారం తార్నాక డివిజన్ ఆర్యనగర్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఆర్యనగర్ యూత్ అసోసియేషన్ నాయకులు బర్త్ డే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు మాట్లాడుతూ బహుజన వర్గాల ఆశాజ్యోతి మాయావతిని దేశంలోని దళిత బహుజనులంతా బలపరచాలనీ కోరారు. కార్యక్రమంలో కుమార్ షాను, పాకాల నాగరాజు, శ్రీధర్, భరత్, కన్నప్ప, పింటూ, శివ, పాండు, అరుణ్, సాయి తదితరులున్నారు.

కేలండర్ ఆవిష్కరణ



బన్సీలాల్‌పేట్: నూతన సంవత్సరం కేలండర్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. బుధవారం నూతన సంవత్సరం–2025 కేలండర్‌ను తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ఆవిష్కరించారు. ముదిరాజ్ సంఘం నాయకుల మధ్య ఈ కేలండర్‌ను కాసాని జ్ఞానేశ్వర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నెల్లూరు నారాయణ, పొట్లకాయ వెంకటేష్, గోవింద్‌రాములు, కాసాని సాయి పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: తల్లి మందలించినందుకు మనస్తాపం చెంది రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... కామారెడ్డికి చెందిన సీహెచ్ శ్రీను కుటుంబం పదేళ్ల క్రితం మేడ్చల్‌కు వలస వచ్చింది. శ్రీనుతో పాటు తన రెండవ కుమారుడు హన్మంతు (22) కూడా మేడ్చల్ ప్రాంతంలో కూలీగా పనిచేస్తున్నాడు. ఇంట్లో జరిగిన గొడవలో భాగంగా తల్లి హన్మంతును మందలించింది. ఇందుకు మనస్తాపానికి గురైన హన్మంతు తమ నివాసానికి సమీపంలోని రైలు పట్టాల వద్దకు వెళ్లి వేగంగా వస్తున్న ప్యాసింజర్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మరో ఘటనలో..

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలి యని వ్యక్తి (40) ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- ఏడాది కాలంగా అదనపు విధులే
- అన్నింటికీ అవుట్‌సోర్సింగే ఆధారం
- బోసిపోతున్న కార్యాలయ విభాగాలు
- పౌరులకు తప్పని ఇబ్బందులు
- లష్కర్ జీహెచ్‌ఎంసీ తీరు

నామమాత్రంగానే అధికారులు



జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ కార్యాలయం

సికింద్రాబాద్: అదనపు విధులకు ఎక్కువ, అసలు విధులకు తక్కువ అన్నట్టుగా మారింది సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ తీరు. ప్రభుత్వం అప్పగిస్తున్న అదనపు విధుల్లో ఏడాది కాలంగా జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు బిజీబిజీగా ఉంటున్నారు. ఎన్నికల విధులు, ప్రజాపాలన, ఇందిరమ్మ గృహాలు, ఓటర్ల గణన తరహా పనుల్లోనే ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారులు, ఉద్యోగులు గడిపేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

◆ అసలే జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్నారు. వీరంతా అదనపు పనుల పేరుతో కార్యాలయానికి రావడం మొత్తంగా మానేశారు. వారికి ఉపయుక్తంగా ఉండే పనులు లేదా ఉన్నతాధికారుల సమీక్షల సందర్భాలు మినహా మిగతా పనిదినాల్లో కార్యాలయానికి రావడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ సేవలు, సమస్యల నిమిత్తం జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

అన్నింటికీ అవుట్ సోర్సింగే!

సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ కార్యాలయంతోపాటు, సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఈ మూడు కార్యాలయాల్లోనూ సిబ్బంది కొరత అధికంగా ఉన్న విషయం తెలిసిందే. ఏడాదికోమారు ఉద్యోగులు, అధికారుల పదవీవిరమణలు మినహా నియామకాలు లేకపోవడం, సదరు ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో సదరు బాధ్యతలను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చూసుకోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.

◆ అన్ని విభాగాల అధికారుల ఛాంబర్ల పేషీల నిర్వహణ మొదలు మిగతా వ్యవహారాలన్నీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే నిర్వహించాల్సిన పరిస్థితులు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఉన్నాయి. మూడు కార్యాలయాల్లోని అన్ని విభాగాల్లో కలిపి సుమారు 500 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జీహెచ్‌ఎంసీ కార్యాలయాల వ్యవహారాలు నడిపిస్తున్నారు.

విభజించినా తప్పని సమస్యలు..

దినదినం పెరుగుతున్న జనవాసాలు, జనాభా సంఖ్యకు అనుగుణంగా పరిపాలన వ్యవహారాలను విస్తరించాలన్న ఉద్దేశంతో సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని కొద్ది సంవత్సరాల క్రితం విభజించారు. ఉమ్మడి సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని నాలుగు డివిజన్లు వేరు చేస్తూ కొత్తగా బేగంపేట సర్కిల్‌ను ఏర్పాటు చేశారు.

◆ విభజన వరకు పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ సేవలను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకెళ్లాలన్న లక్ష్యం మాత్రం నెరవేరలేదు. పేరుకు రెండు సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు తప్ప అందుకు అవసరమైనంత మంది అధికారులను, సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీంతో ఇటు అధికారులు అటు, అటు అధికారులు ఇటు షిఫ్ట్ పద్ధతుల్లో పనిచేయడం మాత్రమే జరుగుతుంది.

ఎప్పటికప్పుడు ఖాళీలు ..

ఉమ్మడి సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో తొమ్మిది మున్సిపల్ డివిజన్లు న్నాయి. ఒక్కో డివిజన్‌కు ఒక్కో టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్, శానిటరీ అధికారి, ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ ఉండాల్సి ఉంది. ప్రస్తుతం రెండు సర్కిళ్లకు కలిపి నలుగురకు మాత్రమే సెక్షన్ అధికారులు, ఇంజినీర్లు, సదరు శానిటరీ అధికారులు ఉన్నారు.

◆ ఇక్కడి అధికారులు రెండు సర్కిళ్లకు సరిపోని పరిస్థితులు ఎదురైన సందర్భాల్లో మల్కాజిగిరి సర్కిల్ నుంచి టౌన్‌ప్లానర్ తదితర విభాగాల అధికారులను అదనపు డ్యూటీల్లో తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పారిశుద్ధ్యం విభాగంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్లు కూడా అరకొరగానే ఉన్నారు. ట్యాక్స్ విభాగంలోనూ అధికారులు లేకపోవడంతో పర్యవేక్షకుల బాధ్యతలను కూడా అవుట్ సోర్సింగ్ సిబ్బందే నిర్వహిస్తున్నారు.

శక్తియుక్తులను సరైన విధంగా వినియోగించాలి

బంజారాహిల్స్: యువత తమ శక్తియుక్తులను సరైన విధంగా ఉపయోగిస్తే నాయకులుగా ఎదుగుతారని, అందుకోసం కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ విద్య, సాల్కర్‌షిప్‌ల డైరెక్టర్ జయశ్రీరమేష్ అన్నారు. 'ది పవర్ ఆఫ్ యు: ట్రాన్స్‌ఫార్మింగ్ ప్రొటెన్షియల్ ఇన్ లీడర్‌షిప్' అనే అంశంపై కోటక్ కన్యా స్కాలర్స్ విద్యార్థులతో బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ జయశ్రీ రమేష్ మాట్లాడుతూ యువ మహిళా స్కాలర్ల నాయకత్వ ఆలోచనలను వివిధ కోణాల్లో లోతుగా పరిశీలించే వకాశం లభించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ రౌండ్‌టేబుల్ చర్చ వారిలోని ఆకాంక్షలను రగిలించిందని, రేపటి నాయకులుగా ఎదగడానికి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని వివరించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్‌లోని లేబరేటరీ ఆఫ్ సెల్ సిగ్నలింగ్ హెడ్ డాక్టర్ రష్న భండారి, కోటక్ సెక్యూరిటీస్ లిమిటెడ్ పీసీజీ ఈక్విటీ సేల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అర్నాబ్ భట్టాచార్య, ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ మానేంద్ర దేశ ర్కార్ తదితరులు పాల్గొన్నారు.



చర్చా కార్యక్రమంలో జయశ్రీ రమేష్ తదితరులు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన డీఎస్‌ఎంకాలనీ నివాసితులు..

సనత్‌నగర్: డీఎస్‌ఎంకాలనీలో పర్యటించి అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం సనత్‌నగర్ డీఎస్‌ఎంకాలనీకి చెందిన పలువురు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను విన్నవించారు. ప్రధానంగా తమ కాలనీలోని చెత్తను సక్రమంగా తరలించడం లేదని తెలపగా, వెంటనే సంబంధిత అధికారికి ఫోన్ చేసి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇలాంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీకి చెందిన మసీదు కమిటీ అధ్యక్షుడు నోమాన్, కాలనీ అధ్యక్షుడు శంషీర్, ఇలియాస్, రషీద్‌ఖాన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

మణిశాస్త్రికి మధురగాన తేజోద్విమణి పురస్కారం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాయిని సైతం కరిగించే.. మనిషి రోగాన్ని సైతం నయం చేసే కళ సంగీతానికి ఉందని ప్రముఖ సాహితీ వేత్త, ఎస్‌బీఐ జీఎం వెంకట్ గరిగపాటి అన్నారు. అంతటి విలువ ఉన్న సంగీతాన్ని ఆస్వాదించే అతి కొద్ది మంది గాయకులలో మణిశాస్త్రి ఒకరని అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సినీనటి జయప్రద 50 సంవత్సరాల సినీ ప్రస్థానం సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యంలో సంగీతానికి ఆకర్షితులైన ఎంతో మందికి మణిశాస్త్రి సంగీతం నేర్పించడం అభినందనీయమని అన్నారు.

● లిటిల్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు రామాచారి మాట్లాడుతూ... కళా సంస్థలు లేకపోతే పాటకు విలువ తగ్గుతుందన్నారు. క ళాసంస్థల వల్లనే కళాకారులు ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన మణిశాస్త్రికి మధురగాన తేజోద్విమణి అనే బిరుదును అంకితం చేశారు. ఈ కార్యక్రమ సమర్పకురాలు మణిశాస్త్రి మాట్లాడుతూ... అందానికి అసలైన చిరునామా జయప్రద అని అన్నారు. సాంఘీక చిత్రాలతో పాటు పౌరాణిక, జానపద, చారిత్రక చిత్రాలలో తనదైన నటనతో ప్రేక్షకులను మైమరిపించారని అన్నారు. శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ, నాదవినోద సంగీత అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీగాయత్రి, కేశవ్, రవళి, స్మృతి, మహతి, చెందన, పవన్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



మణిశాస్త్రికి పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖ సాహితీ వేత్త వెంకట్ గరిగపాటి తదితరులు

పతంగులు ఎగరేసిన నాయకులు



వారాసిగూడలో గాలిపటాలు ఎగురవేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

బౌద్ధనగర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రేటర్ వారాసిగూడ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కార్యాలయం భవనంపై గాలిపటాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు చిక్క దేవదాసు, బొమ్మ నరేందర్, వల్లపు కృష్ణమూర్తి, గోలి జనార్ధన్, మార్కండేయ, మంద మురళి, జక్క శ్రీహరి, మంద ఈశ్వర్, వెంకటరమణ, నాగరాజులు ఎంతో ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు.

పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి అయింది. మధురానగర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఈ నెల 12న రాత్రి జి.శివారెడ్డి సోదరుడి ద్విచక్ర వాహనం తీసుకుకొచ్చి తాను అద్దెకుంటున్న ఇంటి ముందు పార్క్ చేసి వెళ్లారు. ఉదయం చూసేసరికి ద్విచక్ర వాహనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో ట్రాక్టర్ బ్యాటరీ..

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పాపిరెడ్డినగర్‌కు చెందిన పి.మహేష్ జీహెచ్‌ఎంసీ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈ నెల 13న యూసుఫ్‌గూడ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో ట్రాక్టర్‌ను పార్కింగ్ చేసి ఉదయం వచ్చి చూడగా ట్రాక్టర్ బ్యాటరీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సెట్విన్ శిక్షణ కోర్సులు విస్తరిస్తాం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో కొనసాగుతున్న సెట్విన్ శిక్షణ కేంద్రం సేవలను మరింత విస్తృతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ చెప్పారు. సెట్విన్ విస్తరణలో భాగంగా చేపట్టిన భవన పై అంతస్తు నిర్మాణం పనులను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మాట్లాడుతూ ఇప్పటికే సీతాఫల్‌మండిలో తాము నెలకొల్పిన సెట్విన్ శిక్షణ కేంద్రం ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు అభించాయన్నారు. యువతీయువకులతోపాటు ముఖ్యంగా ఇంటి పట్టున ఉండే మహిళలు వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణలు పొంది స్వయం ఉపాధి మార్గాలు ఏర్పాటు చేసుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. భవన నిర్మాణం పూర్తయిన అనంతరం మరిన్ని కోర్సుల్లో శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పద్మారావుగౌడ్ తెలిపారు.



సెట్విన్ భవన నిర్మాణం పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి

లాలాపేట: ఆర్థిక ఇబ్బందులతో ఆత్యహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షల ఆర్థిక సహాయం చేసి అదుకోవాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన తార్నాకలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా ప్రతి సంవత్సరం ఆటో డ్రైవర్లకు రూ.12000 చెల్లించాలన్నారు. దీంతో పాటుగా బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంతో ఆర్టీసి బస్సుల్లో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందన్నారు. కుటుంబాలను పోషించుకోలేక, ఆటోలకు ఫైనాన్స్‌లు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.



బెజ్జాల కృష్ణమూర్తి

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి

ఈపీడీ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పర్యావరణ పరిరక్షణకు తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తక్షణమే రాష్ట్రంలో పూర్తి స్థాయిలో నిషేధించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్(ఈపీడీ) తెలంగాణ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్‌సిహెచ్ రంగయ్య కోరారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో ప్రకృతి విధ్వంసం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1.5లక్షల కోట్లతో మూసీ నది ప్రక్షాళన, చెరువుల పరిరక్షణకు హైడ్రా లాంటి ప్రత్యేక చట్టంతో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి సింగిల్ యూజ్ అనర్థాలపై దృష్టి సారించకపోవడం బాధాకరమని అన్నారు.

వాడవాడలా సంక్రాంతి



గాలి పటాల అలంకరణలో మల్లికార్జున స్వామి..

సనత్‌నగర్: నగరానికి పల్లె సొగసులు వచ్చాయా? అన్నట్లుగా సోమ, మంగళ వారాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఎటుచూసినా పండుగ ఉత్సాహమే ఉరకలేసింది. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా పతంగులతో పోటీపడ్డారు. ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలాడాయి. తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి పర్వదినం రోజున ఇళ్ల ముందు వేసిన రంగురంగుల ముగ్గులు కనువిందు చేశాయి. అపార్ట్‌మెంట్ల వారీగా కలసికట్టుగా తని విశీరా పండుగ వేడుకలను జరుపుకున్నారు. పండుగ మూడు రోజులూ ఆనందోత్సాహాలతో గడిపారు. అమీర్‌పేట్, సనత్‌నగర్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజలు సంక్రాంతి ఉత్సవాల్లో మునిగితేలారు. కొందరు కుటుంబసమేతంగా నగరంలో పల్లెగా చెప్పుకునే శిల్పారామం బాటపట్టి అక్కడ వేడుకలను జరుపుకున్నారు. పండుగనాడు దేవాలయాలు ఆధ్యాత్మిక శోభతో అలరారాయి. సనత్‌నగర్ హనుమాన్‌దేవస్థానం, సంజీవరెడ్డినగర్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం, ఈఎస్‌ఐ చౌరస్తాలోని విజయలక్ష్మి దేవాలయం తదితర ఆలయాల్లో భక్తులు పండుగ వేళ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్తరాయణం ప్రారంభం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, విశేష పుష్పాలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. 108 కలశాల అభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం జరిగాయి. రాజకీయ పార్టీల నాయకులు తమ తమ అధినాయకులను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతికి పెద్ద ఎత్తున జనం తమ సొంత ఊర్లకు వెళ్ళడంతో నగర వీధులన్నీ జన సంచారం లేక వెలవెలబోయాయి. ఇక పిల్లలు, యువకులు, పెద్దలు అనే తారతమ్యం లేకుండా గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. నింగిలో గాలిపటాలతో పోటీపడ్డారు.

◆ మకర సంక్రాంతి సందర్భంగా బీజేపీ జాతీయ నాయకుడు పి.మురళీధర్‌రావును సనత్‌నగర్‌కు చెందిన బీజేపీ నేతలు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు, ఆకుల మహేష్, శ్రీనివాసరావు, సుమన్‌కుమార్, శివప్రసాద్, సుధాకర్‌ముదిరాజ్, కుషాల్‌కుమార్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుకు పతంగులు అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పండగ రోజు పతంగుల జోరు

చిలకలగూడ: లష్కర్‌లోని పలు ప్రాంతాల్లో పతంగుల పండుగ వేడుక సంబరాలు అంబరాన్నంటాయి. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా మేడలు, మిద్దెల పైకి ఎక్కి పతంగులు ఎగురవేస్తు సంబరాలు జరుపుకున్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యేకు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పతంగులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు మేకల కీర్తిహర్షకిరణ్ శ్రీనివాసనగర్‌లో చిన్నారులకు పతంగులు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, సీతాఫల్‌మండి కార్పోరేటర్ సామల హేమలు నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



విశేష అలంకారంలో శ్రీవారు..



గాలిపటాలు ఎగురవేస్తున్న వెల్లాల రామ్మోహన్..



బీజేపీ నాయకుడు మురళీధర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింగరావు తదితరులు..



గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.



చిన్నారులకు పతంగులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు మేకల కీర్తి హర్షకిరణ్‌లు

ఇందిరానగర్‌లో అల్లరిమూకల ఆగడాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్–2లోని ఇందిరానగర్ స్ట్రీట్‌నెంబర్–13లో అల్లరి మూకలు చెలరేగిపోతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో పీకలదాకా మద్యంతాగిన10 మంది యువకులు సిలిండర్లు పైనుంచి కిందకి వేస్తూ, వాహనాలను ధ్వంసం చేస్తూ, రాళ్లు విసురుతూ స్థానికంగా విధ్వంసం సృష్టించారు. రాజీవ్‌గాంధీ విగ్రహం గల్లీలో, స్ట్రీట్‌నెంబర్–13లో ప్రతిరోజూ గంజాయి, మద్యం తాగిన యువకులు తీవ్ర గొడవలకు పాల్పడుతూ దారినపోయేవారిని అడ్డగించి, బెదిరించి డబ్బులు లాక్కుంటున్నారని స్థానిక మహిళలంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గొడవలకు పాల్పడుతున్న వారి వివరాలతో బుధవారం ఈ వీధి ఉండేవారంతా బంజారాహిల్స్ ఎస్‌ఐ యాసీన్ అలీకి ఫిర్యాదు చేశారు. ఈ అల్లరి మూకలు ఇలాగే దౌర్జన్యాలకు పాల్పడితే తాము ఇళ్లు ఖాళీ చేసి వెళ్ళిపోతామని, భయభ్రాంతులకు గురవుతున్నామని, కత్తులు, బ్లేడ్లతో స్వైరవిహారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వీధిలో పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేయాలని, రాత్రిపూట పాట్రోలింగ్ పెంచాలని, గంజాయి బ్యాచ్‌ను పట్టుకోవాలని కోరారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైనా మాంజా స్వాధీనం

వెంగళరావునగర్: అనుమతి లేకుండా విక్రయిస్తున్న చైనా మాంజాను మధురానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రహమత్‌నగర్‌కు చెందిన గ్యాన్‌సింగ్, కార్మికనగర్ నివాసి భూషణ్‌సింగ్ అనుమతి లేకుండా చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆయా దుకాణాలపై దాడులు నిర్వహించి, 81 చైనా మాంజాలను స్వాధీనం చేసుకున్నారు.